క్లుప్తంగా

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

హత్నూర(సంగారెడ్డి): గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎంపీపీ నర్సింహులు, జెడ్పీటీసీ ఆంజనేయులు అన్నారు. హత్నూర మండల కేంద్రంలో రోడ్డు డివైడర్ పనులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలానికి ప్రభుత్వం రూ.8 కోట్లను మంజూరు చేసిందన్నారు. ఈ నిధులతో అన్ని గ్రామాల్లో దశలవారీగా పలు అభివృద్ధి పనులను చేపడుతున్నామని వివరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దుర్గారెడ్డి, రైతు సమన్వయ సమితి మండల కోఆర్డినేటర్ బుచ్చిరెడ్డి, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య



ఉపాధ్యాయులతో ఎంపీపీ రవీందర్‌గౌడ్, నాయకులు, గ్రామస్తులు

జిన్నారం(పటాన్‌చెరు): ప్రభుత్వం పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందని ఎంపీపీ రవీందర్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని కొర్లకుంట, మంత్రికుంట గ్రామాల్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు రూ.1.50లక్షలతో రంగులు, పిల్లలను ఆకట్టుకునే వివిధ రకాల బొమ్మలను వేయించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రవీందర్‌గౌడ్ ఆదివారం పాఠశాలలను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మంచి వాతావరణంలో విద్యను అభ్యసించాలనే ఉద్దేశంతో పాఠశాలలకు రంగులు వేయించి ముస్తాబు చేశామన్నారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్, రవి, రాజు, అనిల్ పాల్గొన్నారు.

కోనోకార్పస్ మొక్కలు తొలగించాలి



వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

నారాయణఖేడ్: మున్సిపాలిటీ పరిధిలోని రాయిపల్లి, హైదరాబాద్, చాంద్‌ఖాన్‌పల్లి రోడ్ల పక్కన, డివైడర్ మధ్యలో నాటిన కోనోకార్పస్ మొక్కలను తొలగించాలని ఏబీవీపీ పట్టణ కార్యదర్శి అనిల్, స్టూడెంట్ ఫర్ డెవలప్‌మెంట్ తెలంగాణ యూనివర్సిటీ కన్వీనర్ నవీన్‌కుమార్, జోనల్ ఇన్‌చార్జి శంకర్, శివాజీ మున్సిపల్ కార్యాలయంలో అధికారులకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోనోకార్పస్ మొక్కలతో ఆస్తమా, అలర్జీ, శ్వాసకోశ వ్యాధులు వస్తాయని వైద్యుల పరిశోధనల్లో తేలిందన్నారు. దీంతో అధికారులు స్పందించి మొక్కలను వెంటనే తొలగించేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

తప్పుడు ప్రచారం సరైంది కాదు



మాట్లాడుతున్న షౌకత్‌అలీ

కోహీర్(జహీరాబాద్): జహీరాబాద్ శాసనసభకు కాంగ్రెస్ తరఫున పోటీచేయనున్న మాజీ మంత్రి చంద్రశేఖర్ స్థానికేతరుడంటూ బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మాజీ ఎంపీపీ షౌకత్‌అలీ విమర్శించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చంద్రశేఖర్ స్వగ్రామం కోహీర్ మండలంలోని రాజనెల్లి గ్రామం అన్నారు. ఉద్యోగరీత్యా తల్లిదండ్రులు వికారాబాద్ వెళ్లారన్నారు. అంతమాత్రాన స్థానికేతరుడు ఎలా అవుతాడని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్‌తో పాటు కేటీఆర్, హరీశ్‌రావు, కవిత ఏమైన తమ సొంత నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తున్నారా అని నిలదీశారు.

లింగాపూర్‌లో వైద్య శిబిరం

హత్నూర (సంగారెడ్డి): మండల పరిధిలోని లింగాపూర్ గ్రామంలో మెగా ఉచిత పశు వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పశు వైద్యాధికారులు సంధ్యారాణి, డాక్టర్ హేమలత మాట్లాడుతూ కృత్రిమ గర్భధారణ, జనరల్ కేసులు, గర్భకోశ తదితర పరీక్షలు చేసి నట్టల నివారణ మందులు వేసినట్లు తెలిపారు. రైతులు గోపాల మిత్ర సేవలు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మి, గోపాల మిత్రలు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధికి నోచుకోని పంచాయతీలు

- వార్డుల సంఖ్య పెరిగినా కానరాని అభివృద్ధి
- సమస్యలకు నిలయాలుగా విలీన పంచాయతీలు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



బురదమయంగా ఉప్పర్ కాలనీ రోడ్డు



రహమత్‌నగర్ కాలనీలో ఇళ్ల మధ్యన నిలిచిన నీరు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ మున్సిపాలిటీలోని ఆయా కాలనీల్లో అభివృద్ధి అంతంత మాత్రంగానే ఉంది. మున్సిపల్ పరిధి విస్తరించినా ఆశించిన మేరకు ప్రగతి పనులు జరగడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రోడ్లు, మురుగు కాలువలు, కల్వర్టులు, తాగునీరు, కరెంట్ వంటి అనేక సమస్యలు ప్రజలను వేధిస్తున్నాయి. మురుగుకాలువలు లేకపోవడంతో దోమలు వ్యాప్తి చెంది మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ లాంటి జ్వరాల బారిన పడుతున్నారు. ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. మున్సిపల్‌లో కొత్తగా విలీనమైన ఐదు గ్రామ పంచాయతీలను పట్టించుకోవడంలేదని ఆయా ప్రాంతాల ప్రజలు వాపోతున్నారు.

కుంటుపడిన అభివృద్ధి

మున్సిపాలిటీలో సుమారు 80 వేల వరకు జనాభా ఉంటుంది. 24వార్డులు ఉండగా కొత్తగా ఐదు పంచాయతీలు మున్సిపల్‌లో విలీనమయ్యాయి. దీంతో వార్డుల సంఖ్య 31వరకు పెంచారు. వార్డుల సంఖ్య పెరిగినా ఆశించిన అభివృద్ధి జరగడంలేదని ప్రజలు వాపోతున్నారు. విలీన పంచాయతీ పరిధిలోని పస్తాపూర్, అల్లీపూర్, చిన్నహైదరాబాద్, రంజోల్, హోతి(కె)తో పాటు పట్టణంలోని శాంతినగర్, హమాలీ కాలనీతో పాటు రాంనగర్, గాంధీనగర్, డ్రైవర్ కాలనీ, రహమత్‌నగర్ తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్యం లోపించింది. మున్సిపల్‌కు కౌన్సిల్ లేకపోవడమే ప్రధాన సమస్యగా మారిందని, వార్డు కౌన్సిలర్‌లు లేకపోవడంతో తమ సమస్యలు ఎవరికి చెప్పుకునే అవకాశం లేకుండాపోయిందని ప్రజలు వాపోతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



మున్సిపల్‌లో విలీనమైన పంచాయతీలు అభివృద్ధికి దూరంగా ఉన్నాయి. పస్తాపూర్ పంచాయతీ పరిధిలోని ఉప్పర్ కాలనీ సమస్యలకు నిలయంగా మారింది. ఇళ్ల ముందే మురుగునీరు పారుతోంది. దీంతో రోగాల బారిన పడుతున్నాం. ఇటీవల మొక్కుబడిగా పిచ్చిమొక్కలు తొలగించారు. విలీన పంచాయతీలపై మున్సిపల్ అధికారులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

– సుభాష్‌సాగర్, పస్తాపూర్ గ్రామస్తుడు

అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి



జహీరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నాం. సమస్యలు అధికంగా ఉన్న చోట వెంటనే ప్రగతి పనులు చేపడుతున్నాం. కొత్తగా విలీనమై ఐదు పంచాయతీల్లో కూడా ప్రగతి పనులు చేపడుతున్నాం. తమ దృష్టికి వచ్చిన సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– మల్లారెడ్డి, మున్సిపల్ కమిషనర్

సంక్షేమం, అభివృద్ధిలో ఆదర్శం



పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: సంక్షేమం, అభివృద్ధిలో ప్రభుత్వం అన్ని రంగాల్లో ఆదర్శంగా నిలుస్తోందని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. ఖేడ్ మండల పరిధిలోని తుర్కాపల్లి, ర్యాకల్, చల్లగిద్ద తండా, పలుగుతండాల్లో రూ.10కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, బతుకమ్మ చీరలు, క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. అదేవిధంగా మున్సిపాలిటీ పరిధిలో టీపీటీఎఫ్, ఎస్టీయూ, సీఐటీయూ తదితర సంఘాల భవనాలకు స్థలాలను కేటాయించి భూమిపూజలు నిర్వహించారు. జూకల్‌కు చెందిన పలువురు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. రుద్రార్‌లో ఎస్‌డీఎఫ్ నిధులు రూ.20 లక్షలతో సీసీ రోడ్డు, మురుగు కాలువ, కమ్యూనిటీ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రుబీనానజీబ్, జెడ్పీటీసీ లక్ష్మీబాయి, ఎంపీపీ చాందీయి, నాయకులు రమేష్‌చౌహాన్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ ప్రజా సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

ధర్మకర్తల ప్రమాణ స్వీకారం

నారాయణఖేడ్ పట్టణంలోని కాశీవిశ్వనాథస్వామి దేవాలయ ధర్మకర్తలుగా నియమితులైన బౌగి హన్మండ్లు, మల్కాపురం సుదర్శన్‌గౌడ్, బ్యాగరి శివాజీ, మాలిపటేల్ షీలాబాయి, కోటగిరి ప్రభురాజ్‌తో పాటు ఆలయ అర్చకులు, ఎక్స్ అఫిషియో సభ్యులుగా నియమితులైన గురురాజశర్మలచే ఈవో మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రమాణస్వీకారం చేశారు. అంతకుముందు గణపతిపూజ, కాశీ విశ్వేశ్వరుడికి అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మకర్తలను ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రుబీనానజీబ్, నాయకులు రమేష్‌చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం చెక్కులు పంపిణీ



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు టౌన్: నియోజకవర్గ పరిధిలో ఇటీవల విద్యుత్ ప్రమాదాల్లో పశు సంపదను కోల్పోయిన రైతులకు, మృతి చెందిన బాలుడి కుటుంబానికి విద్యుత్‌శాఖ నుంచి మంజూరైన నష్టపరిహారం చెక్కులను ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి బాధితులకు సోమవారం పంపిణీ చేశారు. జిన్నారం, గుమ్మడిదల, పటాన్‌చెరు మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన పలువురు రైతులకు సంబంధించి 13 గేదెలు విద్యుత్ ప్రమాదంలో మరణించగా ఒక్కో గేదెకు రూ.40 వేల చొప్పున, రూ.5,20లక్షల పరిహారాన్ని అందజేశారు. బొల్లారం మున్సిపల్ పరిధిలో విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన రిషి అనే బాలుడి కుటుంబానికి రూ.5లక్షల పరిహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్ ప్రభాకర్, గుమ్మడిదల జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, విద్యుత్‌శాఖ డీఈ రమేష్ చంద్ర, ఏడీ దుర్గాప్రసాద్, సీనియర్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మురళి, షేక్‌హుస్సేన్ పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికల్లో బీజేపీదే అధికారం

- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి
- బీజేపీలో ఢిల్లీ వసంత్ చేరిక



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి ఆంజనేయ ఫలం అందజేస్తున్న ఢిల్లీ వసంత్, ఈటల రాజేందర్

జహీరాబాద్: రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. సామాజిక ఉద్యమకారుడు, రైతు నేత ఢిల్లీ వసంత్ సోమవారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎలక్షన్ మేనేజ్‌మెంట్ చైర్మన్ ఈటల రాజేందర్‌లు వసంత్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ చేపడుతున్న అభివృద్ధిని ప్రజలు భారతీయ జనతా పార్టీ వైపు చూస్తున్నారన్నారు. ఆయా పార్టీల ప్రభుత్వాలతో ప్రజలు విసిగిపోయారని తెలిపారు. ఢిల్లీ వసంత్ మాట్లాడుతూ చెరకు రైతుల సమస్యల పరిష్కారం, యువతకు ఉపాధి, మహిళా అభివృద్ధి, కార్మిక సంక్షేమం కోసం పాటు పడతానన్నారు. అనంతరం రాజస్థాన్ నుంచి ప్రత్యేకంగా తెప్పించిన సీతా, రామ, అంజనేయ ఫలాలను మంత్రి కిషన్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ జైపాల్‌రెడ్డి, నాయకులు జనార్ధన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, సుధాకర్‌పాటిల్, వీరారెడ్డి, ఏక్‌నాథ్ పాటిల్, అనిల్‌రాథోడ్, అశోక్‌పాటిల్, అడివన్న, అశోక్ బెల్కేరి, పూల సంతోష్, సుధీర్ భండారి, కుంభ సందేశ్ యాత్ర చైర్మన్ మంకెన శ్రీనివాస్‌రెడ్డి, జర్నలిస్టు కప్పర ప్రాదస్‌రావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని అన్ని కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని కార్పొరేటర్ పుష్ప అన్నారు. డివిజన్ పరిధిలోని కాకతీయ నగర్ కాలనీలో సీసీ రోడ్డు పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. అనంతరం పలు అభివృద్ధి పనులు చేపట్టాలని కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ముగిసిన స్టడీ మెటీరియల్ పంపిణీ

న్యాల్‌కల్(జహీరాబాద్): మూడు రోజులుగా మండలంలో కొనసాగిన పదవ తరగతి విద్యార్థులకు పంపిణీ చేసే స్టడీ మెటీరియల్ పంపిణీ ముగిసింది. మండల పరిధిలోని గుంజోటి, రాంతీర్థ్ తదితర గ్రామాల్లో సోమవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో మాజీ మంత్రి, జహీరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ చీఫ్ కో–ఆర్డినేటర్ డాక్టర్ చంద్రశేఖర్ అందజేసిన స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు పంపిణీ చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

నారాయణఖేడ్: రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ రగ్బీ పోటీలకు నారాయణఖేడ్‌కు చెందిన ఈ–తక్షిల పాఠశాల విద్యార్థులు ఎంపికై నట్లు కరస్పాండెంట్ శరత్ సోమవారం తెలిపారు. ఉమ్మడి జిల్లా స్థాయిలో నిర్వహించిన అండర్–17 విభాగంలో తమ పాఠశాల విద్యార్థులు ముఖేష్, గంబీర్, శ్రీకేష్, సాయిఇకుమార్, చేతన్, అక్షర గెలుపొందారన్నారు. ఈ నెల 12న తొర్రూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు.

ఆలయ అభివృద్ధికి కృషి



పూజలు నిర్వహిస్తున్న చింతా ప్రభాకర్

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి పట్టణ శివారులోని వైకుంఠపురం ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని టీఎస్‌హెచ్‌డీసీ చైర్మన్ చింతా ప్రభాకర్ అన్నారు. వైకుంఠపురం స్వామివారి ఆలయ ప్రాంగణంలో రూ.85 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని సూచించారు. ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మి, కమిషనర్ సుజాత, మాజీ సీడీసీ చైర్మన్ శంకరి విజయేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు వెంకటేశ్వర్లు, పెరుమాళ్ల నర్సింహులు, జలేందర్, విష్ణువర్ధన్, శ్రీరాంవెంకట్ తదితరులు పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘించిన ఎమ్మెల్యేపై ఫిర్యాదు

నారాయణఖేడ్: ఎన్నికల కమిషన్ షెడ్యూల్‌ను విడుదల చేసిన అనంతరం ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి నిబంధనలను అతిక్రమించి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, న్యాయవాది భోజిరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు సోమవారం డీఎస్పీ, ఆర్డీఓ కార్యాలయాల్లో ఫిర్యాదు చేశారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన అనంతరం ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రారంభోత్సవాలు చేయరాదని తెలిసినప్పటికీ స్థానికంగా కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఈ విషయంపై టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ సంజీవరెడ్డి ఆదేశాల మేరకు ఎన్నికల కమిషన్‌కు కూడా ఫిర్యాదు చేశామని తెలిపారు. ముదిరాజ్ సంఘం తాలూకా అధ్యక్షుడు శంకర్ ముదిరాజ్ నాయకులు నారాయణజాదవ్, జ్ఞానేశ్వర్ పాటిల్, సిద్దారెడ్డి, దిలీప్‌రెడ్డి, గిరిధర్, శ్రీకాంత్‌రెడ్డి, కిషన్‌నాయక్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఆడపిల్లకు ఆపన్నహస్తం

కోహీర్(జహీరాబాద్): రాజకీయాలకు తావు లేకుండా కుల, మతాలకు విభేదాలకు అతీతంగా ఆడపిల్ల పెళ్లికి ఆర్థిక సహాయం అందించడానికి మండలంలోని వెంకటాపూర్ గ్రామస్తులు నిర్ణయించారు. యువ నాయకుడు పట్లోళ్ల ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన ప్రతి ఆడపిల్ల పెళ్లికి రూ.11,116 ఆర్థిక సహాయం అందిస్తామని ప్రభాకర్‌రెడ్డి ప్రకటించారు. అదే విధంగా కట్నం లేకుండా పెళ్లిళ్లు జరిపించడానికి కృషి చేస్తామన్నారు. డిమాండ్ చేయకుండా ఎంత ఇచ్చినా సంతోషంగా స్వీకరించి ఆడపిల్ల పెళ్లిలో బ్యాండ్ వాయిస్తున్న బృందాన్ని అభినందించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు శ్రీశైలం, మానయ్య, శంకర్, రవికుమార్, బాల్‌రాజ్, అజీజ్, ఈశ్వరయ్య, అంజయ్య, నాగరాజ్ పాల్గొన్నారు.

జహీరాబాద్ మున్సిపల్ కమిషనర్ సుభాష్‌రావు

జహీరాబాద్: జహీరాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా సుభాష్‌రావు ఇన్‌చార్జి కమిషనర్ మల్లారెడ్డి నుంచి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మల్లారెడ్డి నారాయణ ఖేడ్ పూర్తిస్థాయి కమిషనర్‌గా కొనసాగనున్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

సంగారెడ్డి: ఛత్రపతి శివాజీ మహారాజ్ పట్టాభిషేకం జరిగి 350 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వీరభద్ర ఆలయ నిర్వాహకులు రథయాత్ర వాల్‌పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రథయాత్ర ప్రముఖ్ అంబరీష్ మాట్లాడుతూ ఈ నెల 11న వికారాబాద్, మేకవనంపల్లి నుంచి సదాశివపేట్ మీదుగా సంగారెడ్డికి చేరుకుంటుందన్నారు. అనంతరం పాత బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బహిరంగసభ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ విభాగ ప్రచారకర్త రామకష్ణ, ఆర్ఎస్ఎస్ నాయకులు సురేందర్ రెడ్డి, యాత్ర నిర్వాహక కమిటీ సభ్యులు కొండాపురం జగన్, రవిశంకర్, ద్వారక రవి, పులిమామిడి రాజు, శ్రీనివాస్, హనుమంతరెడ్డి, జగన్నాథ్, మల్లికార్జున, విక్రమ్‌శంకర్, చంద్రశేఖర్, వినోద్, పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ



బ్యాగులను అందజేస్తున్న గడీల ఫౌండేషన్ సభ్యులు

పటాన్‌చెరు టౌన్: మండలంలోని ముత్తంగి గ్రామ పరిధి డీఎన్ కాలనీలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడీల శ్రీకాంత్‌గౌడ్ (గడీల ఫౌండేషన్) సహకారంతో స్కూల్ బ్యాగ్‌లను ఎస్ఆర్‌కే యువసేన సభ్యులు సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

'ఖేడ్'ను జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలి

నారాయణఖేడ్: ఖేడ్ కేంద్రంగా జిల్లాను ఏర్పాటు చేసి వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కృషిచేయాలని మంజీరా జిల్లా సాధన సమితి ఐక్యవేదిక కన్వీనర్ మల్లయ్య, నాయకులు నాగలతా అశోక్ డిమాండ్ చేశారు. నారాయణఖేడ్‌లోని అంబేడ్కర్ భవన్‌లో సోమవారం సాధన సమితి, ప్రజా సంఘాల నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఖేడ్ నియోజకవర్గంలోని తొమ్మిది మండలాలతో పాటు, జహీరాబాద్‌లోని న్యాల్‌కల్, ఆందోలు నియోజకవర్గంలోని రేగోడ్, అల్లాదుర్గం, కామారెడ్డి జిల్లా జుక్కల్, మద్నూర్, పిట్లం, బిచ్కుంద, నిజాంసాగర్ మండలాలతో ఖేడ్ కేంద్రంగా జిల్లాను ఏర్పాటు చేయాలన్నారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్నందునా అనుకూలమైన సమయం కావడంతో డిమాండ్లు మరోసారి తెరపైకి తీసుకువస్తున్నామని తెలిపారు. ప్రజా సంఘాల నాయకులు అశోక్ తోర్నాల్, రాములు, అబ్దుల్ రహీం, పండరి, భీంసేన పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ జీపీ నిర్మాణ పనుల పరిశీలన

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని గడ్డపోతారం గ్రామంలో హెటిరో పరిశ్రమ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న నూతన గ్రామ పంచాయతీ భవన పనులను సర్పంచ్ ప్రకాశ్‌చారితో కలిసి హెటిరో పరిశ్రమ డైరెక్టర్ మోహన్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ రవిబాబు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పనులను త్వరగా పూర్తిచేయించేలా చర్యలు తీసుకోవాలని పరిశ్రమ ప్రతినిధులను కోరారు.

◆ బకాయిలు విడుదల చేయాలి

వట్‌పల్లి(అందోల్): పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని కోరుతూ సోమవారం ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎర్రోళ్ల మహేష్ ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయంలో వినతిప్రతం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు, సంతోష, మంగ, అఖిల, కవిత, స్వప్న, మాధవి, అనుష, భార్గవి, మమత పాల్గొన్నారు.

◆ స్థలం కేటాయించండి

జిన్నారం(పటాన్‌చెరు): గొర్రెలను పెంచేందుకు తగిన స్థలాన్ని కేటాయించేలా చర్యలు తీసుకోవాలని గుమ్మడిదల మండలంలోని యాదవ సంఘం నాయకులు సోమవారం రాష్ట్ర గొర్రెల, మేకల అభివృద్ధి సంస్థ చైర్మన్ బాల్‌రాజ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

◆ అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

సంగారెడ్డి టౌన్ : అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి అన్నారు. ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ వెళ్తున్న సీఐటీయూ నాయకులకు సోమవారం అక్రమంగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్ తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

◆ రోడ్డు పనులు ప్రారంభం

నారాయణఖేడ్: ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డుకు సంబంధించి మన్సూర్‌పూర్‌లో రూ.24లక్షల టీయూఎఫ్ఐడీసీ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను సోమవారం వార్డు కౌన్సిలర్ బుడ్డోళ్ల నర్సింహులు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మూఢ రామకృష్ణ, వార్డుపెద్దలు నాగరాజు, సురేష్, రవి, పాస్టర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

◆ మరమ్మతులు చేపట్టాలి

నారాయణఖేడ్: గుంతలమయంగా మారిన కరస్‌గుత్తి మార్గంలోని పూసల్‌పాడ్, నాగల్‌గిద్ద రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని టీపీసీసీ సభ్యులు శంకరయ్యస్వామి సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మోర్గి వద్ద నిర్మిస్తున్న వంతెన పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

◆ పరిహారం అందజేత

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): నకిలీ పురుగుల మందు పిచికారీ మూలంగా మండల పరిధిలోని అంకేనపల్లి గ్రామానికి చెందిన రైతు మన్నే చంద్రయ్య పత్తి పంట ఎండిపోయిన విషయం విదితమే. దీంతో స్పందించిన అధికారులు, మంజీర రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు పృథ్వీరాజ్ కృషితో పెస్టిసైడ్ షాప్ యజమాని రాజు సోమవారం రైతుకు రూ.35వేల నష్టపరిహారాన్ని చెల్లించారు.

◆ ఎన్నికల నిబంధనలు పాటించాలి

మునిపల్లి(అందోల్): ఎన్నికల కమిషన్ నిబంధనలను ప్రతిఒక్కరూ పాటించాలని బుదేరా ఎస్ఐ సురేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించేవిధంగా ప్రజలందరూ సహకరించాలని సూచించారు.

◆ ఇండోర్ స్టేడియం నిర్మించాలని దీక్ష

సంగారెడ్డి అర్బన్: సంగారెడ్డిలో ఇండోర్ స్టేడియం నిర్మించాలని డిమాండ్ చేస్తూ మంజీరా స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం పోతిరెడ్డిపల్లిలో ఆమరణ నిరాహారదీక్ష చేపట్టారు. విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు, సభ్యులు పాల్గొన్నారు.

◆ అభివృద్ధి పనులకు శంకుస్థాపన

సంగారెడ్డి: చౌటకుర్ మండల పరిధిలోని చక్రియాల గ్రామంలో సర్పంచుల ఫోరం ఉమ్మడి పుల్కల్ మండల అధ్యక్షుడు కిష్టారెడ్డి సోమవారం గ్రామ పంచాయతీ భవన నిర్మాణంతో పాటు సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. సర్పంచ్ బక్కారెడ్డి కిష్టారెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఝాన్సీ రాణి, ఉపసర్పంచ్ తుంగె లక్ష్మి, వార్డుసభ్యులు వడ్డె మంగమ్మ, రవి, ఆత్మ డైరెక్టర్ మల్లేశం పాల్గొన్నారు.

◆ కురుమలపై చిన్నచూపు తగదు

నారాయణఖేడ్: కురుమల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూడటం తగదని కురుమ యువత విభాగం నారాయణఖేడ్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు దశరత్ కురుమ ఆరోపించారు. నారాయణఖేడ్ అంబేడ్కర్ భవన్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వాలు ఎన్‌సీడీసీ, నాబార్డుల ద్వారా స్వయం ఉపాధికి రాయితీ రుణాలు ఇచ్చేవన్నారు. కానీ.. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత నిలిపివేసిందని వాపోయారు. బాధ్యులు కాలేరాజు, హన్మంత్, బీరప్ప, రామకృష్ణ, నర్సింహులు పాల్గొన్నారు.

◆ ఘనంగా అంతర్జాతీయ మానసిక ఆరోగ్య దినోత్సవం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): అంతర్జాతీయ మానసిక ఆరోగ్య దినోత్సవ సందర్భంగా స్పర్శ్ శక్తి సదన్ ఆవరణలో జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో భేటీ బచావో భేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మానసిక వైద్య నిపుణులు జయశ్రీ మాట్లాడుతూ అనారోగ్యానికి దారితీస్తున్న కారణాలు, వాటిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. జిల్లా ఎంపవర్మేంట్ ఫర్ ఉమెన్ కోఆర్డినేటర్ పల్లవి, శక్తి సదన్ ఇన్‌చార్జి సుజాత పాల్గొన్నారు.

◆ కనీస వేతనం ఇవ్వాలి

జహీరాబాద్ టౌన్: మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతం రూ.21 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మహిపాల్ డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు నిరసన తెలిపారు. అనంతరం మున్సిపల్ అధికారికి వినతిపత్రం అందజేశారు.

◆ బీజేపీ శ్రేణుల భారీ ర్యాలీ

సంగారెడ్డి: ప్రధాని నరేంద్రమోడీ పిలుపు మేరకు మేరా మిట్టి మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం బీజేపీ నాయకులు సంగారెడ్డి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అసెంబ్లీ ఇన్‌చార్జి రాజేశ్వరరావు దేశ్పాండే, రాజు తదితరులు పాల్గొన్నారు.

◆ సంగెన్నకు సన్మానం

ఝరాసంగం(జహీరాబాద్): ఇటీవల నూతనంగా ఎన్నికైన ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు సంగన్న ముదిరాజ్‌ను మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హన్మంత్‌రావుపాటిల్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు రుద్రప్పపాటిల్, యువజన కాంగ్రెస్ విభాగం జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌శంకర్ పాటిల్, ఎస్సీసెల్ విభాగం మండల అధ్యక్షుడు పెంటయ్య, మాజీ ఎంపీటీసీ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.